క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన ఆర్యవైశ్య నాయకులు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

జూలూరుపాడు: వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌ను సోమవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు పెండ్యాల విజయ్‌భాస్కర్, పొలిటికల్ కమిటీ జిల్లా చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సత్కరించి, బాలాజీ క్యాలెండర్‌ను అందజేశారు.

బోదకాలు వ్యాధిపై సర్వే



రక్తనమూనాలు సేకరిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది

జూలూరుపాడు: మండలంలోని అన్నారుపాడు గ్రామంలో సోమవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బోదకాలు వ్యాధి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోదకాలు వ్యాధి గుర్తించేందుకు 20 ఏళ్లు పైబడిన వారి రక్త నమూనాలు సేకరించామని, ప్రస్తుతం 19 మంది వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వీరంతా చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. వ్యాధి నిర్ధారణ అయితే వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.రామకృష్ణ, హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌ఏ కృష్ణ, ఏఎన్‌ఎంలు ఆదిలక్ష్మి, వెంకటముత్యం, నాగలక్ష్మి, రీనా, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు చేరిన ఇంటింటి సర్వే

ఇల్లెందురూరల్: పేదల సొంతింటి కల సాకారం చేసే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇంటింటి సర్వే మండలంలో తుది దశకు చేరుకుంది. మండలంలో మొత్తం 29 గ్రామ పంచాయతీలు ఉండగా సోమవారం నాటికి పది గ్రామ పంచాయతీల్లో సర్వే పూర్తయింది. మిగతా 19 గ్రామ పంచాయతీల్లో వంద లోపు దరఖాస్తులు ఉండటంతో మంగళవారం సర్వే పూర్తి చేసేందుకు అధికారులు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇదిలా ఉండగా మండలంలో మారుమూల గ్రామాల్లో సర్వేకు సెల్ సిగ్నల్ అవాంతరంగా మారడంతో ఆఫ్‌లైన్ యాప్‌తో పంచాయతీ కార్యదర్శులు కొంత ఆలస్యంగా సర్వే ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో యజమానులు ఇంటి వద్ద లేకున్నా ఒకటి, రెండు సార్లు ఆయా ఇండ్లను సందర్శించిన కార్యదర్శులు సర్వే పూర్తికి కృషి చేశారు. ఇతర గ్రామాలలో నివాసం ఉంటూ స్థానికంగా దరఖాస్తు చేసుకున్న వారిని గుర్తించి సమాచారం ఇచ్చి, ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు.

కొనసాగుతున్న జీసీసీ కార్మికుల సమ్మె..

పాల్వంచరూరల్: ఎగుమతులు, దిగుమతుల రేట్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) పౌరసరఫరాల శాఖ గోదాము హమాలీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. జీసీసీలో పనిచేస్తున్న 20 మంది హమాలీలు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె సోమవారం నాటికి ఆరో రోజుకు చేరింది. సమ్మెలో పౌరసరఫరాల శాఖ హమాలీ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుస్స మొగిలి, మెరుగు బాబూరావు, కాకర్ల శ్రీను, గడ్డం మధు, ఉప్పనూతల నాగరాజు, భిక్షపతి పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితుల ఔదార్యం

ఇల్లెందు: అనారోగ్యంతో మృతిచెందిన తన స్నేహితుడి కుటుంబానికి తోటి మిత్రులు అండగా నిలిచారు. స్టేషన్‌బస్తీకి చెందిన యుద్ధమూరి వెంకటేశ్వర్లు అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన భార్య, కుమార్తె ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా చిన్ననాటి స్నేహితులు గుర్తించారు. వెంకటేశ్వర్లు కుమార్తె పేరుపై కొంత నగదు జమ చేసి, బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, ఆ బాండ్‌ను సోమవారం వెంకటేశ్వర్లు భార్య, కుమార్తెకు అందజేశారు. పి.సునీల్, ఎం.సునీల్, కిషన్, కుమారస్వామి, అశోక్, జానీ, పాషా, కవిత, సరిత పాల్గొన్నారు.

జూదం ఆడితే కఠిన చర్యలు

ఇల్లెందు: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎవరైనా జూదం ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ బత్తుల సత్యనారాయణ హెచ్చరించారు. సోమవారం ఆయన మాట్లాడారు. కోడి పందేలు, పేకాట ఆడినా, ఆడించినా చట్టరీత్యా నేరమని, చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిధులు లేక.. పనులు పూర్తవక..

- ఇల్లెందులో అభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయిన వైనం
- మల్టీయుటిలిటీ, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పరిస్థితి అంతే..
- త్వరలో ముగియనున్న పాలకవర్గం పదవీకాలం



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనం

ఇల్లెందు: మరో ఇరవై రోజుల్లో ఇల్లెందు మున్సిపల్ పాలక వర్గం పదవీ కాలం ముగియనుంది. అయితే, రూ.కోట్ల వ్యయంతో చేపట్టిన కొన్ని అభివృద్ధి పనులను నిధులు సరిపోక అసంపూర్తిగా వదిలేశారు. ఇక మున్సిపల్ పాలక వర్గం పదవీ కాలం ముగిస్తే వాటి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుత పాలకవర్గం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే మిగిలిన సమయంలో పనులను పునఃప్రారంభిస్తారా అన్నది తేలాల్సి ఉంది.

నిధుల విడుదలలో జాప్యం

యువతకు జీవనోపాధి కోసం శిక్షణ ఇచ్చి ధ్రువపత్రాలు జారీ చేసేలా నైపుణ్యాభివృద్ధి కోర్సుల కేంద్రం(స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో మౌలిక సదుపాయాలు, పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించటం కోసం రూ.1.50 కోట్లు నిధులు కేటాయించారు. రెండేళ్ల కిందట భూమి పూజ చేయగా స్లాబ్ లెవెల్ వరకు నిర్మాణం పూర్తయింది. ఇందులో ఎనిమిది తరగతి గదులు, ఆఫీస్ రూం, ప్రిన్సిపాల్ గది, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా టాయిలెట్లు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే, రూ.1.50 కోట్లు సరిపోక పనులు నిలిచిపోయాయి. మాజీ సీఎం కేసీఆర్ ఇల్లెందు మున్సిపాలిటీకి రూ.25 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించటంతో ఆ నిధుల్లో నుంచి భవనం పూర్తి చేసేందుకు మున్సిపల్ అధికారులు రూ.75 లక్షలు మళ్లించనున్నట్లు తెలిపారు. వీటికి మంజూరు కూడా లభించినా నిధుల విడుదలలో జాప్యంతో పనులు మొదలుకాలేదు.



మల్టీ యుటిలిటీ సెంటర్

నిధులు సరిపోలేదు..

ఇల్లెందులోని బుగ్గవాడు – రైల్వే అండర్ బ్రిడ్జి మధ్య మెయిన్ రోడ్ పక్కన మల్టీయుటిలిటీ సెంటర్ నిర్మాణం మొదలుపెట్టారు. 30 గుంటల స్థలంలో రూ.1.30 కోట్లతో చేపట్టిన ఈ భవనానికీ నిధులు సరిపోలేదు. నిధులు ఉన్న మేర చేపట్టడంతో స్లాబ్ వరకు నిర్మాణం పూర్తయింది. ఇక విద్యుత్, మరుగుదొడ్లు, స్నానపు గదులు, ప్రహరీ, లైటింగ్, సంప్, మోటార్‌లు బిగించాల్సి ఉంది. నిధులు లేక ఏడాదిగా పనులు ముందుకు సాగడం లేదు. ఈ భవనం పూర్తయితే సభలు, సమావేశాల నిర్వహణతో పాటు శుభ, అశుభకార్యాల నిర్వహణకు ఉపయోగంగా ఉంటుంది. పట్టణ నడిబొడ్డున నిర్మిస్తున్న ఈ భవనం పూర్తి చేయడంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇక మిగిలింది 20 రోజులే..

ఇల్లెందు మున్సిపాలిటీ పాలకవర్గానికి ఇంకా 20 రోజుల గడువే మిగిలి ఉంది. 2000 జనవరి 27న మున్సిపల్ పాలకవర్గం పదవీ ప్రమాణ స్వీకారం చేయగా.. ఆటుపోట్ల నడుమ ఐదేళ్ల కాలం గడిచిపోయింది. ఈ నెల 27న పాలక వర్గం గడువు ముగిశాక ప్రత్యేక అధికారుల పాలన మొదలవుతుంది. కాగా, గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ హవా కొనసాగింది. ఇల్లెందు మున్సిపాలిటీ 24వార్డుల్లో 32 వేల మంది ఓటర్లు, 50 వేల మంది జనాభా ఉన్నారు. మూడు స్థానాల్లో బీఆర్‌ఎస్ రెబల్స్, ఒక్కో స్థానంలో సీపీఐ, ఎన్‌డీ నేతలు గెలవగా మిగిలిన స్థానాలన్నీ బీఆర్‌ఎస్ గెలిచింది. ఇక కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ, సీపీఎం బోణీ కూడా కొట్టలేదు. బీఆర్‌ఎస్ ఏకంగా 19 వార్డుల్లో విజయం దక్కించుకోగా, 9వ వార్డు నుంచి ఎన్డీ నేత రేశ్ల నాగలక్ష్మి, 23వ వార్డు నుంచి సీపీఐ అభ్యర్థి కుమ్మరి రవి గెలుపొందారు. అలాగే, రెబల్ అభ్యర్థులు మడత రమ 8వ వార్డు నుంచి, కడకంచి పద్మ, 13వ వార్డు నుంచి, 19వ వార్డు నుంచి పత్తి స్వప్న గెలిచారు.

వేగంగా పూర్తి చేయాలి



పట్టణంలో అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలి. పాలక వర్గం పదవీ కాలం ముగిసే లోపు కనీసం నిధులు కేటాయించి పునఃప్రారంభిస్తే ఆ తర్వాత ఇబ్బంది ఉండదు. ఈ విషయంలో పాలకవర్గానికి తోడు అధికారులు చొరవ చూపాలి.

–చాంద్‌పాషా, ఇల్లెందు

త్వరలోనే పనులు ప్రారంభం



మా పాలకవర్గ పదవీకాలం ముగిసేలోగా పనులన్నీ ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందించాం. ఈ విషయమై ఎమ్మెల్యే కనకయ్య, ఉన్నతాధికారులతో చర్చించాం. అధికారులు కూడా పనులు చేపట్టాలనే కృతనిశ్చయంతో ఉన్నందున త్వరలోనే పూర్తిచేస్తాం.

–దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న కొత్వాల శ్రీనివాసరావు

పాల్వంచ: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని, రాణించాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పాత పాల్వంచలోని సాయినగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను కొత్వాల ప్రారంభించి, మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, తమ జీవితాలను పాడు చేసుకోవద్దని, చదువుతో పాటు క్రీడలు, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ జీవితంలో స్థిరపడాలన్నారు. కార్యక్రమంలో సాయినగర్ యూత్, టోర్నీ నిర్వాహకులు గంగపురి శశి, కాకటి సంపత్, కంచర్ల ప్రవీణ్, అనిల్, గంగపురి సతీష్, చర్ల నాగరాజు, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేశ్, కందుకూరి రాము, శాంతివర్ధన్, అజిత్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడెంను కార్పొరేషన్ చేయడంపై రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం పాల్వంచలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు కొండం వెంకన్న, ఎస్‌ఎ.జలీల్, సాధం రామకృష్ణ, బద్ది కిషోర్, గంగిరెడ్డి భువనసుందర్‌రెడ్డి, ఎస్‌వీఆర్‌కె ఆచార్యులు, మహేశ్, దేవీలాల్, చింత నాగరాజు, పులి సత్యనారాయణ, అశోక్, దేవా, ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు..



కొత్తగూడెంఅర్బన్: మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్



జూలూరుపాడు: అవగాహన కల్పిస్తున్న సీఐ

కొత్తగూడెంఅర్బన్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా సోమవారం బస్టాండ్ సెంటర్‌లో వాహనదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో...

జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో కొత్తగూడెం త్రీటౌన్ సీఐ శివప్రసాద్ ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. నిబంధనల ప్రకారం డ్రైవర్లు ఆటోలు నడుపాలని, కిరాయిల కోసం రాంగ్ రూట్‌లో వాహనాలను నడిపి ప్రమాదాలకు గురికావొద్దని సూచించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జూలూరుపాడు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని చండ్రుగొండ క్రాస్‌రోడ్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జూలూరుపాడు, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి ఎస్‌ఐలు బాదావత్ రవి, చంద్రశేఖర్, శివరామకృష్ణ, పోలీస్ సిబ్బంది, ఆటోడ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రగతివనం పార్కు సందర్శన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధి రుద్రంపూర్‌లోని ప్రగతివనం పార్కు, అందులోని చెరువు, బతుకమ్మ ఘాట్, నూతనంగా నిర్మించిన ట్యాంకుబండ్‌ను సోమవారం ఏరియా జీఎం శాలేంరాజు సందర్శించారు. పార్కు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనుల్లో జాప్యం జరిగినా.. పనుల్లో నాణ్యత లోపించినా బిల్లులు నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చెరువులో బోటింగ్‌కు అవసరమైన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జీఎం వెంట ఏరియా ఎస్‌వోటూ జీఎం, ఏరియా వర్క్‌షాపు జీఎం శ్రీకాంత్, డీజీఎం పర్సనల్ శివకేశవరావు, జీకేఓసీ పీఓ రమేశ్, హరినారాయణ, మధూకర్, ఎస్ఎస్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పార్కును పరిశీలిస్తున్న జీఎం శాలేంరాజు

వలంటీర్ల కృషి అభినందనీయం



వలంటీర్లకు జ్ఞాపికలు అందజేస్తున్న నాయకులు

ఇల్లెందు: గత నెల 20, 21 తేదీల్లో ఇల్లెందులో జరిగిన సీపీఎం జిల్లా 3వ మహాసభలు విజయవంతం కావటానికి స్థానిక పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, వలంటీర్లు, ప్రజానీకం కృషి అభినందనీయని సీపీఎం రాష్ట్ర నాయకులు పి.సోమయ్య, అన్నవరపు కనకయ్య అన్నారు. సోమవారం ఇల్లెందులోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడారు. ఉద్యమాల గడ్డ ఇల్లెందులో పార్టీ శ్రేణులు విశేషంగా కృషి చేశారని చెప్పారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ నెల 25, 26 తేదీల్లో పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఏజే రమేశ్, అబ్దుల్ నబీ, మాచర్ల గోపాల్, పగడాల నాగేశ్వరారావు, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, తాళ్లూరి కృష్ణ, మన్యం మోహన్‌రావు, సుల్తానా, ఖాదర్, మాదారపు వెంకటేశ్వర్లు, సంధ్య, సర్వన్, వజ్జా సురేశ్, బయ్యా అభిమన్యు, కొడెం బోస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వలంటీర్లకు జ్ఞాపికలు అందజేశారు.

క్షయ వ్యాధిపై అవగాహన ఉండాలి

ఇల్లెందురూరల్: క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రొంపేడు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కవిత సూచించారు. మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీ సంజయ్‌నగర్‌లో సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. దేశంలో 347 జిల్లాల పరిధిలో క్షయ వ్యాధి తీవ్రంగా ఉందని, అందులో రాష్ట్రంలో తొమ్మిది జిల్లాలు ఉన్నాయని, వాటిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కూడా ఉందని చెప్పారు. దీనిని దృష్టిలో పెట్టుకొని క్షయవ్యాధిపై అవగాహన పెంచుకొని నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సైదులు, ప్రమోద్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ కవిత

వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణ

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకేఓసీ పరిసర ప్రాంత యువకులు, నిర్వాసితులు, వారి పిల్లలకు వోల్వో డంప్ ట్రక్ ఆపరేటర్‌గా శిక్షణ ఇవ్వనున్నట్లు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన మాట్లాడారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలని, హెవీ గూడ్స్ వెహికల్ లైసెన్స్ 3 ఏళ్ల అనుభవం ఉండాలని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు ఎంవీటీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

మురుగునీటితో అవస్థ



హనుమాతండాలోని డ్రెయినేజీ

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం పంచాయతీ హనుమాతండాలో సైడు కాల్వలు లేకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు రోడ్డు పక్కనే పారుతూ దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు నీటిలో దోమలు విపరీతంగా వృద్ధి చెంది గిరిజనులు ఆస్పత్రుల పాలవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మొక్కజొన్న, మిర్చి పంటల పరిశీలన



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

టేకులపల్లి: మండలంలోని దాసుతండాలోని మొక్కజొన్న పంటతోపాటు ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో మిర్చి వ్యవసాయ క్షేత్రాన్ని ఇల్లెందు డివిజన్ వ్యవసాయ అధికారి (ఏడీఏ) గుగులోత్ లాల్‌చంద్.. మండల వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. పంటపై పురుగులు, అనారోగ్యాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. ఈ పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 5 శాతం ఎస్‌జీ (ప్రోక్లెమ్) ఎకరానికి 90 గ్రాములు పిచికారీ చేయాలని లేదా ఇసుక, సున్నం సుడులలో పోయాలన్నారు. మిర్చి పంటలో నల్ల తామర పురుగు ఉధృతి ఉన్నందున ఎకరానికి 15 నుంచి 20 నీలిరంగు జిగురు అట్టాలు చేనులో అమర్చాలని లేదా స్పైనోసాడ్ 45 శాతం ఎస్‌సీ ట్రేసర్, స్పైనోస్టార్ మందును 70 ఎంఎల్ ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. లేదా ఫిప్రోనిల్(రీజెంట్) మందును 400 ఎంఎల్ ఒక ఎకరానికి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. పంటలపై ముడత ఆశించకుండా రైతులు ముందుగానే పసుపు, నీలం రంగు అట్టాలు అమర్చాలని సూచించారు. ఏఓ అన్నపూర్ణ, ఏఈఓ శ్రావణి పాల్గొన్నారు.

'రైతులను ముంచిన కాంగ్రెస్'

ఇల్లెందు: ఎన్నికల ముందు అనేక అబద్ధపు వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను నిండా ముంచిందని బీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యులు, గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ ఆరోపించారు. సోమవారం ఇల్లెందు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతు భరోసా రూ.15 వేలు చెల్లిస్తామని ప్రకటించి రూ.12 వేలకు తగ్గించి ఇవ్వటం రైతులను నిండా ముంచడమేనని, ఏడాది కాలం ముగిసిన తర్వాత బీఆర్‌ఎస్ ఒత్తిడితో తలొగ్గినా కుదించి అందజేస్తామని ప్రకటించటం దుర్మార్గమని పేర్కొన్నారు. మాట నిలుపుకోని కాంగ్రెస్ రైతులకు క్షమాపణ చెప్పి రూ.15 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు సిలివేరు సత్యనారాయణ, ఎస్.రంగనాథ్, భావ్‌సింగ్ నాయక్, ఎర్రబెల్లి కిష్టయ్య, అబ్దుల్ నబీ, జబ్బార్, గిన్నారపు రాజేశ్, హరికృష్ణ, ఆదూరి రవి, పోషం, ఘాజీ, మునిగంటి శివ, చాంద్‌పాషా, సురేశ్, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.



ఇల్లెందు: ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

టేకులపల్లిలో..

టేకులపల్లి: రైతు భరోసా పేరిట ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు లక్కినేని సురేందర్‌రావు విమర్శించారు. సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో టేకులపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బొమ్మెర్ల వరప్రసాద్, బోడ బాలు, బాణోతు కిషన్, భూక్య బాలకృష్ణ, చీమల సత్యనారాయణ, కుమ్మరి కిరణ్, భూక్య లాలు, లచ్చు, లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.

డైరీలు, క్యాలెండర్ల ఆవిష్కరణ



కొత్తగూడెంటౌన్: క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా న్యాయమూర్తి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం జిల్లా కోర్టులో సోమవారం గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన ప్రతిష్ఠాన్–2025 నూతన క్యాలెండర్లను జిల్లా జడ్జి పాటిల్ వసంత్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి.భానుమంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ జిల్లా అధ్యక్షులు మహ్మద్ సాధిక్‌పాషా, ఉపాధ్యక్షులు ఉప్పుశెట్టి సునీల్, జిల్లా సహాయ కార్యదర్శి యాసా యుగేందర్, ఈసంపల్లి నాగరాజు, సీనియర్ న్యాయవాదులు మెండు రాజమల్లు, అంబటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో

ఇల్లెందు: ఇల్లెందు మండల టీపీటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈఓ కార్యాలయంలో డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పూర్ణచందర్‌రావు మాట్లాడారు. ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంఈఓ స్వామి, సీహెచ్ రమేశ్, బి.వెంకట్రాం, సర్వేశ్వరరావు, రాజారత్నం, జగన్, రాములు, కిషన్, శివ, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో

పాల్వంచ: సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్ సేన ఉపాధ్యక్షులు రాపాక కాంతరాజు, పట్టణ అధ్యక్షులు ఎస్‌కే పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ కాంపాటి దుర్గాప్రసాద్, కాంపాటి మహేశ్, రవి, సిరాజ్, సాయి, రాజు, పైడిపల్లిపల్లి మహేశ్ పాల్గొన్నారు.

కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో

పట్టణంలోని బీసీఎంరోడ్‌లో గల కమ్మ సేవా సంఘం కార్యాలయంలో నూతన సంవత్సరం 2025 క్యాలెండర్‌ను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు, డాక్టర్ బి.సుధాకర్, కిలారు నాగేశ్వరరావు, కనగాల అనంతరాములు, కిలారు పురుషోత్తంరావు, హరి సత్యనారాయణ, పొందూరి నరసింహారావు, రవి, శివప్రసాద్, కట్ల శ్రీనివాసులు, శివప్రసాద్, వడ్లమూడి పూర్ణచందర్‌రావు, కల్యాణం లక్ష్మీపతి, పాటిబండ్ల అభివన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మం సేవలు అజరామరం

ఇల్లెందు: విద్యార్థి సంఘంలో చేరి, ఎత్తి పట్టిన ఎర్రజెండాను తుది వరకు మోసిన ఏపూరి త్యాగం అజరామరం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సోమవారం ఇల్లెందులో సీపీఐ రాష్ట్ర నాయకులు ఏపూరి బ్రహ్మం సంస్మరణ సభ సీఈఆర్ క్లబ్‌లో రాష్ట్ర నాయకులు కె.సారయ్య అధ్యక్షతన జరిగింది. కూనంనేని సాంబశివరావు ఏపూరి బ్రహ్మం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇల్లెందు ఏరియాతో మమేకమైన ఏపూరి బ్రహ్మం అనేక పోరాటాలలో పాలు పంచుకున్నారని, అక్రమ కేసులను ఎదుర్కొన్నారని, తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగాన నిలిచారన్నారు. ముక్కుసూటిగా వ్యవహరించే బ్రహ్మం ప్రజల మధ్య లేకపోయినా ఆయన ఆశయం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర నాయకులు బాగం హేమంతరావు, సీపీఐ, పలు పార్టీల నేతలు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, ఏపూరి లలితాదేవీ, కొమురయ్య, కృష్ణ, బాస శ్రీనివాస్, రాఘవేంద్ర, మంచాల వెంకటేశ్వర్లు, గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఎంసీ నాగిరెడ్డి, దిండిగాల రాజేందర్, మిర్యాల రంగయ్య, అఫ్జల్, పులి సైదులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కూనంనేని సాంబశివరావు